సాక్షి
హనుమకొండ
బుధవారం । 25 । డిసెంబర్ । 2024

కరుణాపురం క్రీస్తుజ్యోతి ప్రార్థనామందిరంలో కొవ్వొత్తులతో ప్రార్థనలు చేస్తున్న విశ్వాసకులు, సందేశం ఇస్తున్న దైవజనులు పాల్సన్‌రాజు, జయప్రకాశ్





లోకరక్షకుడు ఏసుక్రీస్తు

- అర్ధరాత్రి నుంచి మొదలైన ఆరాధనలు
- కేక్ కటింగ్.. ప్రత్యేక ప్రార్థనలు

జిల్లాలోని పలు చర్చిల్లో మంగళవారం రాత్రినుంచే క్రిస్మస్ ఆరాధనలు ప్రారంభమయ్యాయి. రాత్రి 12 గంటలకు కేక్ కట్ చేసి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగ సందర్భంగా కరుణాపురం క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరం, ఫాతిమా కేథడ్రల్ చర్చి, హనుమకొండ సెంటినరీ బాప్టిస్ట్, దేశాయిపేట సెంటినరీ బాప్టిస్ట్, వరంగల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, గొర్రెకుంట గిఫ్ట్ ఆఫ్ జీసెస్ తదితర చర్చిలను నిర్వాహకులు విద్యుత్ దీపాలు, స్టార్లు, క్రీస్తుజననం తెలిపే పశువుల పాకలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కరుణాపురం చర్చి ప్రాంగణంలో 40 ఫీట్ల క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేసినట్లు వ్యవస్థాపకులు రెవరెండ్ డాక్టర్ సంగాల పాల్సన్‌రాజ్, గోపు జయప్రకా లు తెలిపారు. రాత్రి కేక్ కట్ చేసి భక్తులనుద్దేశించి దివ్య సందేశం ఇచ్చారు. కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు జరిపారు. జిల్లా ప్రజలకు కలెక్టర్ ప్రావీణ్య, మేయర్ గుండు సుధారాణి వేర్వేరుగా క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

– కాజీపేట రూరల్/ధర్మసాగర్



కాజీపేట ఫాతిమా కేథడ్రల్ చర్చిలో దివ్య బలిపూజ సమర్పిస్తున్న బిషప్ ఉడుముల బాల

భక్తులకు ఎలాంటి ఇబ్బందీ కలగొద్దు

- కలెక్టర్ ప్రావీణ్య
- కొత్తకొండ జాతరపై సమీక్ష



కొత్తకొండ జాతర సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య, పక్కన ఈజీ రమేశ్, అధికారులు

ఎల్కతుర్తి: కొత్తకొండ వీరభద్రస్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందీ తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య.. ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో జరిగిన అధికారుల సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జనవరి 10నుంచి ప్రారంభమయ్యే జాతరకు పోలీసు, రెవెన్యూ, వైద్య, ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రోడ్లు, భవనాలు, విద్యుత్, దేవాదాయ, పర్యాటక తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఉత్సవాలను విజయవంతానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశా నిర్దేశం చేశారు. పార్కింగ్, సీసీ కెమెరాల ఏర్పాట్లు, వీఐపీ పాస్‌లు, బారికేడ్లు, విద్యుత్, ఆర్టీసీ, వైద్య, ఆరోగ్యం, శానిటేషన్, ఫైర్ సేఫ్టీ అధికారులతో చర్చించారు. భక్తుల కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సుల సంఖ్యను పెంచాలన్నారు. రోడ్ల మరమ్మతు పనులు వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతలకు పటిష్ట బందోబస్తు చేపట్టాలన్నారు. ఆలయం లోపల భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆలయ ఈఓ కిషన్‌రావును ఆమె ఆదేశించారు. అంతకు ముందు స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన కలెక్టర్‌కు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భద్రకాళి సమేత వీరభద్రస్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ రమేష్, కాజీపేట ఏసీపీ తిరుమల్, డీఎంహెచ్ఓ అప్పయ్య, చంద్రశేఖర్, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

జంక్షన్ పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్

ఎల్కతుర్తిలో చేపట్టిన జంక్షన్ పనులను మంగళవారం కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి కలెక్టర్ పి.ప్రావీణ్య పరిశీలించారు. రోడ్లకు ఇరువైపులా మార్కింగ్ చేసి వీలైనంత త్వరగా పనులు ప్రారంభించి వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రాత్రి సమయంలో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని పోలీసుఅధికారులకు సూచించారు. కార్యక్రమంలో కుడా సీపీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, తహసీల్దార్ జగత్‌సింగ్, ఎంపీడీఓ విజయ్‌కుమార్, పలు శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడలకు ఏర్పాట్లు చేయాలి

హన్మకొండ అర్బన్ : సీఎం కప్ క్రీడాపోటీల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితో కలిసి క్రీడల నిర్వహణపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 27నుంచి జనవరి 2వ తేదీ వరకు హనుమకొండలోని జేఎన్ఎస్‌లో సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీవైఎస్ఓ అశోక్, డీఎంహెచ్ఓ అప్పయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ఐక్యతను పెంపొందిస్తాయి

ఉత్సవాలు ఉద్యోగుల్లో ఐక్యతను పెంపొందిస్తాయని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మంగళవారం జిల్లా టీఎన్జీఓస్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో కలెక్టర్ ప్రావీణ్య పాల్గొని కేక్ కట్ చేశారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్ఓ గణేష్, డీఆర్డీఓ పీడీ మేన శ్రీను పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదు

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: అభివృద్ధి పనులపై సంబంధిత శాఖల ఇంజనీర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హెచ్చరించారు. మంగళవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని జూ పార్కు, భద్రకాళి బండ్‌ను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. యుద్ధప్రతిపాదికన జూ పార్కులో బాక్స్ డ్రైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వరద నివారణను ఎదుర్కొనేందుకు అడ్వకేట్స్ కాలనీ, నందిహిల్స్ కాలనీ తదితర ప్రాంతాల నుంచి వచ్చే నీటి ప్రభావాన్ని నివారించడానికి జూ పార్కులో బాక్స్ డ్రైన్ నిర్మాణం అత్యంత కీలకమన్నారు. అనంతరం భద్రకాళి బండ్ ప్రాంతంలో పర్యటించిన కమిషనర్ చెరువులో శుద్ధిప్రక్రియ చేపట్టడానికి గల అవకాశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. 'కుడా' సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీంరావు, సీఎంహెచ్ఓ రాజారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

30 మంది జేఏలకు పోస్టింగ్

హన్మకొండ అర్బన్ : గ్రూప్–4 ద్వారా రెవెన్యూ శాఖలో ఉద్యోగాలు పొందిన 30 మంది జూనియర్ అసిస్టెంట్లకు (జేఏలు) మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులు నియామక ఉత్తర్వులు అందజేశారు. జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు 32 మంది ఎంపిక కాగా వివిధ కారణాలతో ఇద్దరు రిపోర్టు చేయలేదు. మిగిలిన 30 మందిలో 11 మందికి కలెక్టరేట్‌లో, 8 మందికి పరకాల, హనుమకొండ ఆర్డీఓ కార్యాలయాల్లో, 9 మందికి జిల్లాలోని వివిధ తహసీల్దార్ కార్యాలయాల్లో, మరో ఇద్దరికి జిల్లా కోర్టులో జూనియర్ అసిస్టెంట్లుగా పోస్టింగులు ఇచ్చారు. వీరంతా ఒకట్రెండు రోజుల్లో రిపోర్టు చేయనున్నట్లు కలెక్టరేట్ పరిపాలన అధికారి గౌరీశంకర్ పేర్కొన్నారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

- డీసీసీ అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా, కలెక్టర్‌కు వినతి



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు

హన్మకొండ/హన్మకొండ అర్బన్: ప్రపంచ దేశాలు మన రాజ్యాంగాన్ని ప్రశంసిస్తుంటే, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించారని, ఇది దుశ్చర్య అని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడిన అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు మంగళవారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నా చేశారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, కే.ఆర్.నాగరాజు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, తదితర నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి అమిత్ షాను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మతతత్వ రాజకీయాలు చేసే బీజేపీకి అంబేడ్కర్ లాంటి మహోన్నత వ్యక్తి దేశానికి చేసిన సేవ గురించి తెలియదన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు లేఖ రాశారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్ ప్రావీణ్యకు వారు వినతిపత్రం అందజేశారు.

మీడియా దృష్టిని ఆకర్షించేందుకు హరీశ్‌రరావు పర్యటన

ఇటీవల జిల్లాకు ఓ శుభకార్య నిమిత్తం వచ్చి హరీశ్‌రావు మీడియా దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నం చేశారని వారు విమర్శించారు. ఆస్పత్రి నిర్మాణం పేరుతో భూమి పేపర్ తాకట్టు పెట్టి రూ.1,400 కోట్లను మహారాష్ట్ర బ్యాంకు నుంచి రుణం తీసుకొని కమీషన్లు పొందిన వ్యక్తి హరీశ్‌రావు అని ఆరోపించారు. ఆయా కార్యక్రమాల్లో టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, ఈవీ శ్రీనివాస్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మొహమ్మద్ అజీజ్ ఖాన్, టీపీసీసీ నాయకులు రవళి, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, లక్ష్మణ్, ఆనంద్, మిర్జా అజీజుల్లా బేగ్, సరళ, పింగిలి వెంకట్రాం నర్సింహారెడ్డి, పెరుమాండ్ల రామకృష్ణ, అనిల్ కుమార్, వెంకట రాజ్ కుమార్, అశోక్ రెడ్డి, రవీందర్ రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లతో కఠినంగా ఉండాలి

- సీపీ అంబర్ కిషోర్ ఝా



రికార్డులను పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

ఖిలా వరంగల్: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే రౌడీషీటర్లతో పోలీసులు కఠినంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌ను డీసీపీ రవీందర్, ఏసీపీ నందిరామ్‌నాయక్‌తో కలిసి సీపీ తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పోలీస్ స్టేషన్‌లో రిసెప్షన్ కౌంటర్ సేవలు, సిబ్బంది పనితీరు, రికార్డులు, పరిసరాలను ఆయన పరిశీలించారు. ఫిర్యాదుదారులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం జరిగిందని ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నంను సీపీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడారు. శాంతిభద్రతల రక్షణకు పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, ప్రజల భద్రత ముఖ్యమని, రౌడీషీటర్లపై నిఘా పెట్టాలని, స్టేషన్‌కు వచ్చే వారితో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. అలాగే స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అంతకు ముందుగా సీపీ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఎస్సైలు సురేష్, రవీందర్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.





క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్..

నల్లగొండ జిల్లా కేంద్రంలో మంగళవారం ప్రారంభమైన 43వ తెలంగాణ స్టేట్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్న జనగామ, మహబూబాబాద్, వరంగల్, భూపాలపల్లి జిల్లాల క్రీడాకారులు.

వాట్సాప్‌లో రెచ్చగొట్టే మెసెజ్‌లు పెట్టిన ఇద్దరికి రిమాండ్

దుగ్గొండి: వాట్సాప్ గ్రూపుల్లో రెచ్చగొట్టే మెసెజ్‌లు పోస్టు చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన ఓ వ్యక్తి, గ్రూప్ అడ్మిన్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 14రోజుల రిమాండ్ విధించినట్లు దుగ్గొండి సీఐ సాయిరమణ మంగళవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. దుగ్గొండి మండలం బిక్కాజిపల్లి గ్రామంలో మన గ్రామం.. మన అభివృద్ధి టైటిల్‌తో 55 మంది సభ్యులతో వాట్సాప్ గ్రూప్ ఉంది. గ్రూప్ అడ్మిన్‌గా మేర్గు రాజు ఉన్నాడు. ఈ క్రమంలో ఈనెల 8న గ్రామానికి చెందిన మాచపత్రి ఈశ్వరయ్య.. పార్టీలు, ఆయా పార్టీల కార్యకర్తలను రెచ్చగొట్టేలా వాయిస్ మెసెజ్‌లు పోస్టు చేసి గ్రామంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరించాడు. దీంతో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా నేరం నిరూపణ అయ్యింది. దీంతో మాచపత్రి ఈశ్వరయ్య, గ్రూప్ అడ్మిన్ మేర్గు రాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారని సీఐ తెలిపారు.

యూనివర్సిటీ పదవుల్లో బీసీలను నియమించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న శ్రీనివాస్‌గౌడ్

కేయు క్యాంపస్ : తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో జనాభా దామాషా ప్రకారం వైస్‌చాన్స్‌లర్‌తో పాటు ఇతర పాలన పదవుల్లో బీసీలను నియమించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఊరుకోబోమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం కేయూ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు నియమించిన వైస్ చాన్స్‌లర్ పదవుల్లో కేవలం ముగ్గురు బీసీలకు మాత్రమే అవకాశం కల్పించి తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా బీసీకి అవకాశం కల్పించకపోతే ఆ మండలి ఎదుట నిరసన తెలుపుతామని స్పష్టం చేశారు. ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల భూములు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. విశ్వవిద్యాలయాల భూములను కాపాడే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. ఖాళీలను భర్తీ చేసి యూనివర్సిటీలను బలోపేతం చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, మెస్‌బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. విద్యార్థుల త్యాగాలతోనే వచ్చిన రాష్ట్రంలో బడుగు, బలహీన విద్యార్థులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వాన్ని నిలదీయడమే లక్ష్యంగా బీసీ సంక్షేమ సంఘం బాధ్యతతో ముందుకెళ్తోందన్నారు. ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటుతో ప్రభుత్వ యూనివర్సిటీలు నిర్వీర్యమవుతున్నాయన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీల్లో టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 'హైడ్రా'ను స్వాగతిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరేగంటి నాగరాజు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, దాడిమల్లయ్య యాదవ్, అశోక్ గౌడ్, బోనగాని యాదగిరి గౌడ్, ప్రదీప్‌గౌడ్, రీసెర్చ్ స్కాలర్స్ మహబూబ్‌పాషా, అభిరామ్, నాగరాజు, పృథ్వీ, వేణు, తదితరులు పాల్గొన్నారు.

19వ రోజుకు ఎస్ఎస్ఏల సమ్మె

విద్యారణ్యపురి: తమకు పేస్కేల్ వర్తింపజేసి, రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు (ఎస్ఎస్ఏ) సమ్మె కొనసాగిస్తున్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల సమగ్ర శిక్ష ఉద్యోగులు ఏకశిల పార్కు వద్ద చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం 19వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఈ సమస్యలను పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. శిబిరంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దొనికల శ్రీధర్‌గౌడ్, ఎండీ షఫీ పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలు గుర్తించాలి

- వరంగల్ కలెక్టర్ సత్యశారద



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద, పాల్గొన్న అధికారులు

వరంగల్: పోషకాహార లోపాన్ని తరిమికొట్టాలంటే కౌమార దశలో ఉన్న బాలబాలికల్లో అనారోగ్య సమస్యలను ముందస్తుగా గుర్తించి అవసరమైన చికిత్స అందించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా పోషణ అభియాన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీలు, సూపర్‌వైజర్లు లబ్ధిదారుల గృహాలను సందర్శించాలన్నారు. జిల్లా పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ కార్తీక్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, డీఎంహెచ్ఓ సాంబశివరావు, డీఈఓ జ్ఞానేశ్వర్, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డాక్టర్ రాజేందర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు గడువులో పూర్తి చేయాలి

కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్, విమానాశ్రయం ఏర్పాటు, ఇన్నర్ రింగ్ రోడ్డు, నేషనల్ హైవే గ్రీన్ ఫీల్డ్ కారిడార్ పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. అభివృద్ధి పనుల పురోగతిపై మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆమె అధికారులతో మాట్లాడారు. వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ స్వామి, జీఎం ఇండస్ట్రియల్ సల్మాన్‌రాజ్, అడిషనల్ డీఆర్డీఓ రేణుక, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో సమస్యల సత్వర పరిష్కారం

పెరుగుతున్న అవసరాలు, అందుబాటులోకి వచ్చిన ఆధునిక టెక్నాలజీ ద్వారా ఆన్‌లైన్‌లోనే వినియోగదారుల సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన వినియోగదారుల సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందని అన్నారు. డీఎస్ఓ కిష్టయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈసదస్సులో సివిల్ సప్లయీస్ డీఎం సంధ్యారాణి, డీసీఐసీ అధ్యక్షుడు గిరగాని సుదర్శన్‌గౌడ్, కన్స్యూమర్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుగుపల్లి శ్రవణ్ కుమార్, డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్, క్యాట్కో ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ రతన్ సింగ్ ఠాగూర్, శ్రీనివాస, దామోదర్, నాగేల్లి సారంగం, ప్రభాకర్, సంపత్, లక్ష్మయ్య, వెంకన్న పాల్గొన్నారు.

వీహబ్ పోస్టుల భర్తీలో గోల్‌మాల్ వాస్తవమే..

- ముందే చెప్పిన సాక్షి


సాక్షి
వీ హబ్ ఉద్యోగాల్లో గోల్‌మాల్!

గోల్‌మాల్‌పై 2023 జులై 22న ప్రచురితమైన సాక్షి కథనం

కాజీపేట సెంటర్ : జిల్లా సంక్షేమ శాఖలో కొత్త మిషన్ శక్తి పథకం కింద డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్‌కు సంబంధించిన కాంట్రాక్ట్ ఉద్యోగ నియామకాల్లో గోల్‌మాల్ జరిగినట్లు రుజువైంది. నాటి డీడబ్ల్యూఓ(జిల్లా సంక్షేమాధికారి) అర్హులకు అన్యాయం చేసి తనకు అనుకూలమైన అభ్యర్థులకు కనీసం సర్టిఫికెట్స్ పరిశీలించకుండా అదే కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగుల కుటుంబ సభ్యులకు అవకాశం ఇచ్చారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇదే విషయంపై కొంత మంది అభ్యర్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దత్తత కోరుకునే తల్లిదండ్రులను ఇబ్బందులు పెడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈ నియామకాలపై విచారణ చేపట్టిన ఆర్జేడీ ఎటూతేలలేదు. దీంతో పోలీస్ ఇంటలిజెన్స్ అధికారులు విచారణ చేపట్టి ఇటీవలనే నివేదిక అందజేశారు. ఈ విషయంపై మంగళవారం డీడబ్ల్యూఓ రాజమణిని వివరణ కోరగా.. స్పెషలిస్టు ఇన్ ఫైనాన్స్ లిటరసీ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగి సుజాతది నకిలీ పీజీ సర్టిఫికెట్ అని రిపోర్టు వచ్చిందన్నారు. అయితే సుజాత రిపోర్టు గురించి ముందే గ్రహించిన సుజాత తన ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లడం కొసమెరుపు. దీంతోపాటు గతంలో దత్తత విషయంలో నిబంధనలు పాటించని అధికారిపై విచారణ జరిగిందని నివేదికలు ఉన్నతాధికారులకు పంపించామని, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని అన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

న్యూశాయంపేట: మైనార్టీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీ) నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో మూడునెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వరంగల్, హనుమకొండ జిల్లాల మైనార్టీ సంక్షేమ అధికారులు టి.రమేశ్, డి.మురళీధర్‌రెడ్డి వేర్వేరు ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఇంటర్, ఆపై చదువుకున్న అర్హులైన యువతకు జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. దరఖాస్తులను ఈనెల 31లోగా ఆయా కార్యాలయాల్లో అందజేయాలన్నారు. వివరాల కు హనుమకొండ జిల్లా వారు సుబేదారి కలక్టరేట్ కాంప్లెక్స్‌లో 2వ అంతస్తు, వరంగల్ జిల్లా వారు సుబేదారి అపోలో ఫార్మసీ పక్కన 2వ అంతస్తులో ఉన్న కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

కాలేజీ హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య

- వరంగల్ నగరంలోని ఏకశిలా గర్ల్స్ క్యాంపస్‌లో ఘటన
- విద్యార్థి సంఘాల ఆందోళన
- అనారోగ్యమే కారణమంటున్న పోలీసులు



కాలేజీ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాలు, బంధువులు

హసన్‌పర్తి: హనుమకొండ పరిధిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న ఓ విద్యార్థిని మంగళవారం ఆ కాలేజీ హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రాంధన్ తండాకు చెందిన గుగులోతు శ్రీదేవి(16) నగరంలోని డబ్బాల్ జంక్షన్ వద్ద గల ఏకశిలా గర్ల్స్ క్యాంపస్‌లో ఇంటర్ (ఎంపీసీ) ఫస్టియర్ చదువుతోంది. మంగళవారం రాత్రి 9 గంటలకు కాలేజీ హాస్టల్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన తోటి విద్యార్థులు కాలేజీ నిర్వాహకులకు చెప్పగా వెంటనే చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. సదరు విద్యార్థి శ్రీదేవి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కారణంగానే హాస్టల్ గదిలో ఉరివేసుకుందని చెప్పారు.

విద్యార్థి సంఘాల ఆందోళన..

శ్రీదేవి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు, బంధువులు రాత్రి కాలేజీ వద్దకు భారీగా చేరుకున్నారు. మృతదేహంతో కాలేజీ ఎదుట బైఠాయించారు. శ్రీదేవి మృతికి కళాశాల యాజమాన్యమే కారణమని ఆరోపించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అర్ధరాత్రి వరకు ఆందోళన కొనసాగింది.

అవయవదానానికి అంగీకారం



అంగీకార పత్రాన్ని చూపుతున్న దంపతులు

హసన్‌పర్తి: మరణానంతరం తమ పార్థివదేహాలను కాకతీయ మెడికల్ కళాశాలకు అప్పగించేందుకు దంపతులు ముందుకు వచ్చారు. హనుమకొండ మండలం గోపాలపురం వినాయక నగర్‌కాలనీకి చెందిన సూరం మహేందర్ ఆర్టీసీలో ఉద్యోగి, ఆయన భార్య పద్మజా గృహిణి. కాగా మరణానంతరం తమ దేహాలను వైద్య విద్య విద్యార్థులకు ఇవ్వడానికి నిర్ణయించారు. తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు కామిడి సతీశ్‌కు సమాచారం అందించారు. ఈమేరకు మంగళవారం వారు ఆ దంపతుల ఇంటికి వెళ్లి వారితో మాట్లాడి వారినుంచి అంగీకార పత్రం తీసుకున్నారు. ఈ పత్రాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అందిస్తామన్నారు. మునిగాల పద్మపుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి పుష్కరాలకు ప్రణాళికలు

- వచ్చే ఏడాది మే 15 నుంచి పుష్కరాలు
- రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కాళేశ్వరం: వచ్చే ఏడాది మే 15 నుంచి సరస్వతి నది పుష్కరాల నిర్వహణ, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సంబంధితశాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం ఆయన జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కేంద్రంలో జాతీయ రహదారి 353(సీ)పైన కాళేశ్వరం దేవస్థానం ఆర్చిగేటు పునఃనిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో శివరాత్రికి, మే నెలలో జరగనున్న సరస్వతి నది పుష్కరాలకు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించనున్నామన్నారు. జిల్లా మీదుగా కాళేశ్వరం.. సిరొంచ వరకు నాలుగు వరుసల రహదారికి అనుగుణంగా వెడల్పుతోపాటు అధునాతన డిజైన్‌తో ఆర్చి నిర్మాణం చేయాలన్నారు. నాలుగు వరుసల రహదారి కోసం ప్రతిపాదనలు చేస్తున్నామని పేర్కొన్నారు.పుష్కరాలకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తజనం తరలి రానున్నందున, వారికి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు అందజేస్తామన్నారు.



ఆర్చిగేటుకు భూమి పూజచేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఇండియన్ ఎకనామిక్ సదస్సుకు శ్రీధర్‌కుమార్‌లోథ్



శ్రీధర్‌కుమార్‌లోథ్

కేయూ క్యాంపస్: హరియాణలోని కురుక్షేత్ర యూనివర్సిటీలో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ సదస్సులో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ పాల్గొననున్నారు. 'సోషియో అండ్ డెమోగ్రాఫిక్ ఫీచర్స్ ఆఫ్‌ది పాపులేషన్ ఏ స్టడీ ఇన్ తెలంగాణ' అనే అంశంపై ఆయన పరిశోధన పత్రం సమర్పించనున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ హౌస్, ఫ్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్, చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. సిబిల్ అవసరం లేదు. సంప్ర॥ 8341479342.
[WA-7550]

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిగ్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179
[DA-6124]

WANTED

■ సానిటరీ షాపులో పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువకులు కావలెను. జీతం: 10000 పైనే, సాయి శ్రీ ఎంటర్ ప్రైజస్, ఫాతిమానగర్ జంక్షన్, ఖాజీపేట, సంప్ర॥ 8712555227, 9502270178.
[WA-631]

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 15,000 నుండి 20,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418.
[M-1256014]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్, జీ : 18K. Ph: 9640400073, 9160900024
[SCA24000888]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.